## ఏయూ వాలీబాల్ జట్టుకు ఆదర్శ్ విద్యార్థిని

విశాలాంధ్ర - పెందుర్తి: ఆంధ్రా యూనివర్సిటి వాలీబాల్ జట్టుకు స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాల సెకండ్ ఇయర్ బిసిఎ విద్యార్థిని యు.లలిత ఎంపిక అయిందని ప్రిన్సిపాల్ ఎస్ఈ ఫ్లోరా తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ టి.థియో ఫెలస్ మాట్లాడుతూ ఆంధ్ర యూనివర్సిటి టీంకి ఆదర్శ్ విద్యార్థిని లలిత ఎంపికైందని, తమిళనాడులో జనవరి రెండవ వారంలో జరిగే ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో ఆమె పాల్గొంటున్నందుకు సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఆదర్శ్‌లో చదువుతోపాటు ఆటలకు కూడా ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తూ ప్రతిభగల విద్యార్థులకు తమవంతు ప్రోత్సాహం ఇస్తుందని తెలియజేశారు. ప్రతి ఒక్కరు స్పోర్ట్స్, గేమ్స్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని వైస్ ప్రిన్సిపాల్ ఏ. శ్రీనివాస్‌రావు తెలిపారు.

## ప్రభుత్వ మార్కెట్ యార్డు స్థలం కబ్జా

### మార్కెట్ ధర సుమారు 50 కోట్ల పై మాటే...

### నిద్రపోతున్న మార్కెట్ యార్డ్ అధికారులు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: కోట్లు విలువ చేసే సర్కారు స్థలం ఆక్రమణదారుల చేతుల్లో ఉన్నా పట్టించుకోని అధికారుల వైఖరిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విశాఖ - విజయనగరం మధ్య విలువైన స్థలాలు కబ్జాకు గురికావడంపై ప్రభుత్వం దృష్టిసారించడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మధ్యకాలంలో ఎక్కడ చూసినా కబ్జాదారులు చెలరేగిపోతున్నారు. అమాంతంగా భూముల ధరలు పెరిగే సరికి ప్రైవేట్ భూములతో పాటు ప్రభుత్వ భూములను కూడా వదలడం లేదు, ఎలాగైనా సరే చేజిక్కించుకొని సొమ్ము చేసుకుందాం అనుకుంటున్నారు. వివరాల్లోకెళ్తే విజయనగరం జిల్లా, డెంకాడ మండలం, మోదవలస గ్రామ రెవెన్యూ పరిధిలో సుమారు 4 ఎకరాల ప్రభుత్వ మార్కెట్ యార్డ్ స్థలం 1977,1978,1979 సంవత్సరంలో సర్వే నెంబర్లు 209/2, 72 సెంట్లు, కాళ్ళ అప్పన్న, డాక్యుమెంట్ నెంబర్ 3824/1978, సర్వే నెంబర్ 210/2, 1.02 ఎకరా, ఎర్నింటి సన్యాసమ్మ, కాళ్ల గద్దెప్ప, డాక్యుమెంట్ నెంబర్ 3829/1978, 210/3లో 40 సెంట్లు జిరాయితీ భూమిని కాళ్ళ అచ్చమ్మ డాక్యుమెంట్ నెంబర్ 3823/1978, సర్వే నెంబర్ 210/4, 64 సెంట్లు ఎర్నింటి సన్యాసి, రాములమ్మ, డాక్యుమెంట్ నెంబర్ 3827/1978, అలాగే సర్వేనెంబర్ 210/5లో 1.16 ఎకరాలు, ముని పెంటమ్మ, డాక్యుమెంట్ నెంబర్ 3822 /1978, ఈ పట్టాదారులు క్రయ దస్తావేజు ద్వారా భీమునిపట్నం సబ్ రిజిస్టర్ కార్యాలయంలో భీమునిపట్నం మార్కెట్ యార్డుకు, అలాగే పోలిపల్లి వ్యవసాయదారుల సేవా సహకార సంఘానికి అప్పట్లో రిజిస్ట్రేషన్ చేసారు. ఆనాటి నుండి ఆ ప్రభుత్వ స్థలంలోకి మార్కెట్ యార్డ్ అధికారులు అప్పట్లో తగరపువలసలో ఉన్న మార్కెట్‌ను ఏర్పాటు చేద్దామని ప్రయత్నించినప్పటికీ మండలాలు వేరువేరు కావడంతో ఆ మార్కెట్ యార్డ్ స్థలంలో రేకుల షెడ్లు నిర్మాణాలు కూడా చేపట్టి కొన్నాళ్ళు పాటు మార్కెట్లో క్రయవిక్రయాలు చేశారు. తర్వాత మండలాలు వేరు కావడంతో భీమిలిలో ఉన్న మార్కెట్ యార్డ్ సంస్థ పూసపాటిరేగ తరలించడంతో ఖాళీగా ఉన్న ఈ స్థలంపై కొందరు రాజకీయ నాయకుల కన్ను పడింది. ఎవరు రాకపోవడంతో మరల ఎవరైతే రిజిస్ట్రేషన్ చేశారో 2015 సంవత్సరంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే స్థలం వారసులు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చారు. కాళ్ళ గద్దప్ప కుమారుడు నారాయణ పేరు మీద 2016 సంవత్సరంలో డెంకాడ తహశీల్దార్ కార్యాలయంలో కాళ్ల నారాయణ పేరు మీద వన్ బిలో పేరు నమోదు చేశారు. అలాగే ముని పెంటమ్మ వారసులుగా ఆదన్న 2016 సంవత్సరంలో రెవెన్యూ రికార్డులో పేరు నమోదు చేశారు. అనంతరం తెలివిగా కాళ్ల నారాయణ పేరుతో రెవెన్యూ రికార్డులు నమోదైన తర్వాత కాళ్ళ రామసూరి, సూరిబాబు, పేరు మీద భోగాపురం సబ్ రిజిస్టర్ కార్యాలయంలో సర్వేనెంబర్ 210/2,210/3, 1.42ఎకరాలు, స్థలాన్ని గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసుకొని భూ పత్రాలు చూపించి హైకోర్టునే తప్పుదోవ పట్టించి స్టే ఆర్డర్ తెచ్చారు. స్టే ద్వారా మార్కెట్ యార్డ్ స్థలంలో కొబ్బరి మొక్కలు నాటారు. అనంతరం కోర్ట్ ఆర్డర్ పత్రాలను పంచాయతీ అధికారులకు చూపించి పన్ను వేయించుకున్నారు. తర్వాత తెలివిగా విద్యుత్ అధికారులను బురిడీ కొట్టించి షెడ్లు నిర్మాణం చేపట్టిన వాటికి విద్యుత్ మీటర్లు పొందారు. ఈ ప్రభుత్వ స్థలంను చిన్న చిన్న ముక్కలుగా విభజించి క్రయవిక్రయాలు జరుపుటకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. నిజంగా వారు నిజమైన హక్కుదారులైతే కోర్టుకు అసలు ఎందుకు వెళ్లారు. స్టే ఎందుకు తెచ్చుకున్నారనే వాదన అయితే బలంగా వినిపిస్తుంది. అలాగే సర్వేనెంబర్ 209/2ఎ, సబ్ డివిజన్‌గా విభజించి కాళ్ళ గద్దెప్ప కుమారుడు నారాయణ, పాత్రపల్లి సత్యనారాయణకు 2023 సంవత్సరంలో భోగాపురం సబ్ రిజిస్ట్ కార్యాలయంలో 58 సెంట్లు భూమి రిజిస్ట్రేషన్ చేశారు. మిగిలియున్న 14 సెంట్లు భూమిలో కాళ్ల నారాయణ కుమారుడు కాళ్ళ రామసూరి షాపింగ్ మాల్‌ను పూర్తిస్థాయిలో కట్టేసి, అద్దెలకు ఇచ్చేశాడు. అలాగే సర్వేనెంబర్ 210/4,5లో నేషనల్ హైవేకు కొంత స్థలం పోగా మిగిలియున్న 77 సెంట్లు స్థలంను ముని పెంటమ్మ వారసులుగా చెలామని అవుతున్న ముని ఆదయ్య, కరణం వెంకటేష్ అనే ఆసామికి 2018 సంవత్సరంలో ఆనందపురం సబ్ రిజిస్టర్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేశారు. అయితే ఎఫ్‌సీఓ రికార్డులో మార్కెట్ యార్డ్‌గా ఇన్ కార్పొరేషన్ అయినప్పటికీ, రెవెన్యూ అధికారులు మరల ఆన్లైన్‌లో వీరి పేర్లు నమోదు చేసి, ఈ పాసుపుస్తకాలు కూడా ఇచ్చేశారు. మొత్తానికి 50 కోట్లకు పైగా విలువ చేసే ప్రభుత్వ భూమిని అక్రమంగా కబ్జా చేస్తుంటే మార్కెట్ అధికారులు నిద్రపోతున్నారా అనే సందేహం వస్తుంది. అప్పట్లో ఎంతమంది అధికారులకు పెద్ద మొత్తంలో ముడుపులు అందాయో తద్వారా కళ్ళు మూసుకొని మరల రికార్డులు తారుమారు చేయడంతో ప్రభుత్వ మార్కెట్ యార్డుకు అమ్మిన వ్యక్తులే మరల ఆ స్థలంపై కన్నేశారు. భీమిలి, పోలిపల్లి ఉమ్మడిగా భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ, పోలిపల్లి వ్యవసాయదారుల సేవా సహకార సంఘంకు అప్పట్లో ప్రభుత్వం కొనుగోలు చేసింది. అప్పట్లో తగరపువలసలో ఉన్న మార్కెట్‌ను ఈ స్థలంలో ఏర్పాటు చేద్దామని కొందరు అధికారులు ప్రయత్నించినప్పటికీ మండలాలు వేర్వేరు కావడంతో ఆ స్థలాల్లో కొందరు అధికారులు ఆధ్వర్యంలో రేకుల షెడ్లు నిర్మాణాలు కూడా చేపట్టారు. కొన్నాళ్లపాటు మార్కెట్ల అధికారులు అనుమతులు ఇవ్వడం ఆశ్చర్యం కలిగిస్తుంది. అధికారులు ఇప్పటికైనా పూర్తిస్థాయిలో విచారణ జరిపితే నిజానిజాలు బయటికి వస్తాయని, ఎవరైనా ప్రశ్నిస్తే భూ ఆక్రమణదారులు దాడులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని చెబుతున్నారు. కోట్లు రూపాయలు విలువచేసే భూములపై అధికారులు స్పందించి ప్రభుత్వ భూములు కాపాడాలని పలువురు కోరుతున్నారు.

## నేడు సాగర తీరంలో నేవీ డే వేడుకలు

### హాజరుకానున్న సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: నావికా దళ వేడుకలకు విశాఖ సాగర తీరం ముస్తాబైంది. ఇప్పటికే గత వారం రోజులుగా రిహార్సల్స్ పేరుతో విన్యాసాలు నిర్వహిస్తున్న నావికాదళం ముగింపు వేడుకల్లో భాగంగా శనివారం సాయంత్రం సాగర తీరంలో ఆర్కే బీచ్ వద్ద నేవీ డే ఉత్సవాలకు ఏర్పాటు చేశారు. ఈ వేడుకలకు రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడుతోపాటు పలు వురు మంత్రులు హాజరుకానున్నారు. తూర్పు నావి కాదళం అధిపతి రాజేష్ పెందల్కర్‌తోపాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన నున్నారు. త్రివిధ దళాల విన్యాసాలతో పాటు నావికా సత్తాను చాటే విధంగా ప్రతి ఏటా సాగర తీరంలో విన్యాసాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఈ ఏడాది కూడా ముగింపు ఉత్సవాలను విశాఖలో నిర్వహిస్తుండగా ఇటీవల ఒడిస్సా రాష్ట్రంలోని పూరీలో నావిక విన్యాసాలు నిర్వహిం చారు. శనివారం సాయంత్రం జరిగిన నేవీ వేడుకలకు విశాఖ నగర పోలీసులు ట్రాఫిక్ కాంక్షలు విధించారు. కోస్టల్ బ్యాటరీ నుండి పార్కు హోటల్ జంక్షన్ వరకు బీచ్ రహదారిపై వాహనాలకు అనుమతి లేదని నగర పోలీసులు తెలియజేశారు.

## వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర - సాగర్‌నగర్: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 10వ తేదీన జరగనున్న వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు పూర్తయ్యావని ఆలయ ఏఈవో జగన్మోహ నాచార్యులు తెలిపారు. ఆరోజు ఉదయం 4 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు సర్వదర్శనాలు నిర్వహించనున్నామని, అయితే 4 గంటల నుండి 6 గంటల వరకు వీఐపీ, వీవీఐపీ, డోనర్స్‌కు ప్రత్యేక దర్శనాలు ఉంటాయని తెలిపారు. అదేవిధంగా సాయంత్రం 7 గంటల నుండి 7:30 నిమిషాల వరకు బ్రేక్ ఉంటుందని అన్నారు. ఆరోజు సుమారు 50 వేల నుండి 60 వేల మంది వరకు భక్తులు శ్రీవారి దర్శించుకునే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశామని, త్రాగునీరు, పార్కింగ్ వంటిపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు.

## కమ్యూనిటీ హాల్ స్థలంలో అక్రమ నిర్మాణాలు

### ప్రభుత్వ స్థలం ఆక్రమణపై గ్రామస్తులు ఫిర్యాదు

విశాలాంధ్ర - ఆనందపురం: వెల్లంకి పంచాయతీ బొడ్డపాలెం జగనన్న లేఔట్ సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలం ఆక్రమణపై గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. సర్వే నెంబరు 292లో కొంతమంది అక్రమంగా షెడ్లు ఏర్పాటు చేసి ఆక్రమణకు పాల్పడుతున్నారని అధికారులకు ఫిర్యాదు చేశారు. జగనన్న కాలనీ సమీపంలో సుమారు ఎకరా 17 సెంట్లు ప్రభుత్వ భూమిలో దివిస్ వారి సౌజన్యంతో కొంతమేర పార్కు, వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయుచున్నారు. ఈ పార్క్ సమీపంలో కొంత మంది కన్ను పడి షెడ్లు నిర్మాణం చేపట్టడంతో గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేసి ప్రభుత్వ భూముల్లో ప్రజా ఉపయోగాలకు అవసరమైన కమ్యూనిటీ హాల్, అంగన్వాడి కేంద్రం, హెల్త్ సెంటర్ నిర్మాణాలు చేపట్టాలని అక్రమాలకు పాల్పడరాదని పేర్కొన్నారు. ఈ మేరకు గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ కార్యదర్శి శ్రీరామ్ మూర్తి సంఘటన స్థలానికి చేరుకొని ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాలు చేపట్టినట్లయితే చర్యలు తప్పవన్నారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన షెడ్లను తొలగిస్తున్నామన్నారు. అక్రమ స్థలంలో శుక్రవారం గ్రామస్తులు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. సంఘటన స్థలానికి ఎస్సై గంట్యాడ సంతోష, మహిళా పోలీస్,గ్రామ కార్యదర్శి శ్రీ రామ్మూర్తి చేరుకొని అక్రమ స్థలాలను పరిశీలించారు.

## విశాఖ ఉక్కులో ప్రమాదం

### కిందకు తూలి పడ్డ కన్వేయర్లు

విశాలాంధ్ర - గాజువాక: ఆర్ ఐ ఎన్ ఎల్ - విశాఖ ఉక్కు కర్మాగారంలో శుక్రవారం ప్రమాదం చోటు చేసుకుంది. మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగినట్టు తెలుస్తోంది. కర్మాగారంలోని సింటర్ ప్లాంట్‌లో ఏ 1, ఏ 2 కన్వేయర్లు పడిపోయాయి. దీంతో ఉత్పత్తి నిలిచి పోయింది. ఈ ప్రమాదం లో ఎలాంటి ప్రణ నష్టం జరుగలేదు . ఈ ప్రమాదం జరిగిన వెంటనే ఉక్కు ఉన్నతాధికారులు సంఘటన స్థలానికి చేరుకొని సమీక్షించారు . ఉక్కు లోని కార్మిక సంఘాలు ప్రమాద స్థలానికి చేరుకొని వరి స్థితి నీ అక్కడున్న ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు . ఈ ప్రమాదం పై ఉక్కు భద్రతా అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదం పై పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి వుంది.

### మెయింటెనెన్స్ పట్ల నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణం

### -కార్మిక సంఘాలు

విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ అమ్మాలని కేంద్ర బిజెపి నిర్ణయించిన తర్వాత స్టీల్ ప్లాంట్‌లో మెయింటినెన్స్ పట్ల ఏ మాత్రం శ్రద్ధ చూపటం లేదని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. మెయింటినెన్స్ కోసం ఒక రూపాయి కూడా కేటాయించలేదని, ఉన్న కార్మికుల సంఖ్యను తగ్గించేస్తుందని, ఫలితంగానే ఈరోజు ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయని కార్మిక సంఘాల విమర్శిస్తున్నాయి. గతంలో సెంటర్ ప్లాంట్ త్రీ లో కన్వేయర్ సూట్ కూలిపోయిందని,ఆర్ ఎమ్ హెచ్ పి లో రిక్లైమర్ కూలిపోయిన ఉదంతాలు గుర్తు చేశారు. నేడు తాజాగా సెంటర్ ప్లాంట్ లో ఏ వన్, ఏ టు కన్వేర్లు స్ట్రక్చర్ అమాంతం కూలిపోయిందని దీనివలన సెంటర్ మిషన్లకు మెటీరియల్ సప్లై ఆగిపోయి సెంటర్ ఆగిపోతుందని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. సెంటర్ లేకపోవడం వల్ల బ్లాస్ట్ ఫర్ నెస్ లో ఉత్పత్తి ఆగిపోతుందని,ఇప్పుడిప్పుడే రేటెడ్ కెపాసిటీ నుంచి ఉత్పత్తి జరుగుతు ఉండడం వల్ల స్ట్రక్చరల్ మెయిన్టెనెన్స్ ఎప్పటికప్పుడు చేస్తూ ఉండాలని నాయకులు ఆరోపిస్తున్నారు. గతంలో అనేకసార్లు యాజమాన్యానికి చెప్పడం జరిగిందని,అయినప్పటికీ డబ్బులు లేవంటూ యాజమాన్యం మెయింటెనెన్స్ పై శ్రద్ధ పెట్టలేదన్నారు. దీని ఫలితంగానే ఈరోజు కన్వేర్లు పడిపోవడం జరిగిందని . తక్షణమే వీటి మీద దృష్టి సారించాలని ప్లాంట్లో ఉన్న అన్ని స్ట్రక్చర్స్ ను తనిఖీ చేయించి మరమ్మతులు చేపట్టాలని ఏఐటీయూసీ, సిఐటియు సహా పలు కార్మిక సంఘాలు డిమాండ్ చేసాయి. ఈ ప్రమాదాన్ని ఏఐటీయూసీ నాయకులు డి ఆదినారాయణ, కే ఎస్ ఎన్, స్టీల్ సిఐటియు నాయకులు జె అయోధ్యరామ్, యు రామస్వామి, వైటి దాస్ సందర్శించి సమస్య తీవ్రతను ఉన్నత యాజమాన్యం దృష్టికి తీసుకుని వెళ్లారు.

## ఘనంగా సావిత్రి బాయి పూలే జయంతి

విశాలాంధ్ర - భీమిలి: 18వ వార్డు మున్సిపల్ హైస్కూల్‌లో సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలను ఆదర్శ హిందీ ప్రేమ మండలి ఆధ్వర్యంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఇమంది వెంకట్రావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆదర్శ హిందీ ప్రేమి మండలి గౌరవాధ్యక్షులు గంట నూకరాజు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయిని అని, సంఘసంస్కర్త అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అల్లాడ శ్రీనివాసరావు, ఆల్తి రామకృష్ణ, ఎం.రామకృష్ణ, రాజు మాస్టారు, ఉదయ రాణి, ఎలిమెంటరీ స్కూలు ప్రధానోపాధ్యాయిని జీరు లక్ష్మి, పద్మ, లీలామణి పాల్గొన్నారు.

పెదగంట్యాడ: భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు విశాఖ జిల్లా పెదగంట్యాడ మండలం జడ్పీ హైస్కూల్ నడుపూరులోని జనవిజ్ఞాన వేదిక పెదగంట్యాడ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్షులు ఎస్వికే.పరశురాం ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తొలుత సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాల అర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు నరసింహ, జేవీవీ కార్యదర్శి ఎం.సింహాచలం, ఉపాధ్యాయులు నారాయణరావు, ఈశ్వరరావు, మహిళా ఉపాధ్యాయుల కార్యదర్శి కె.మంగమ్మ, జెవివి నాయకులు ఢిల్లీరావు, వై.వరప్రసాద్, కేటియు భాస్కర్, డి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాది: మహిళలకు చదువుకునే హక్కు కల్పించడం కోసం, స్వయంగా విద్యను నేర్చుకుని సావిత్రి బాయి పూలే మొదటి ఉపాధ్యాయిని అయ్యారని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) మధురవాడ జోన్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కే.సుజాత, బి.భారతి అన్నారు.సావిత్రిబాయి జయంతి సందర్భంగా కొమ్మాది కార్యాలయంలో చిత్ర పటానికి పూలమాల వేసి నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే మహిళలను విద్యకు దూరం చేసే మనువాదులతో అలుపెరగని పోరాటం చేశారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కే.పుష్ప, ఎల్.పద్మ, బి.లక్ష్మి, డి.తులసి, డీకే చంద్రిక, ఉమాశైలజ పాల్గొన్నారు.

తగరపువలస: స్థానిక ఒకటవ వార్డు, జి.వి.యం.సి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రెడ్డివల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆమె అట్టడుగు వర్గాలు, మహిళలకు చదువు, సంపద వంటి సమస్త హక్కులు నిరాకరింపబడిన దేశం లో, ఆనాటి సమాజపు కట్టుబాట్లను, బ్రాహ్మణవాద సంప్రదాయాలను, ఆధిపత్య వర్గాలను ధిక్కరించి భారతదేశపు మొట్టమొదటి ఉపాధ్యాయురాలిగా పాఠశాలలు ప్రారంభించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వహణ కమిటీ చైర్మన్ షేక్ షర్మిల, ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, ఈగల సంజీవి, బుగత మల్లిక తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం: ప్రముఖ సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే 195వ జయంతి వేడుకలు బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పద్మనాభం మండల బీజేపీ అధ్యక్షురాలు తమటపు నాగమణి అధ్యక్షత వహించిన కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర వైద్య విభాగ కన్వీనర్ రూపాకుల రవికుమార్ హాజరై సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా రూపాకుల రవికుమార్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే భారతదేశంలోని మొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా పనిచేశారని అన్నారు. కార్యక్రమంలో టి.నాగమణి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిజెపి కౌన్సిల్ సభ్యులు ఉప్పాడ అప్పారావు, పద్మనాభ మండలం మాజీ అధ్యక్షుడు రెడ్డిపల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు సిరపరపు వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి పాలూరి కృష్ణారావు, కలగర్ల పేర్రాజు, ఉపాధ్యక్షుడు గౌరీ రెడ్డి, మత్స సోమేశ్వరరావు, చప్ప కృష్ణ, జొన్నాడ గౌరీ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

## గోపాలపట్నం కళాసేవ పీఠం విస్తృత సమావేశం

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ గోపాలపట్నం కళాసేవ పీఠం విస్తృత సమావేశం ముడసర్లలోవ పార్క్‌లో జరిగింది. ఈ సందర్భంగా పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు నందవరపు సోములు ప్రసంగిస్తూ పీఠం ప్రారంభించి 9 సంవత్సరాలు కావస్తుందని, ఈ తొమ్మిది సంవత్సరాల్లో అనేక కార్యక్రమాలు నిర్వహించి అందరి మన్ననలు పొందామన్నారు. విద్యార్థులకు చేయూతనిస్తూ, బడుగు బలహీన వర్గాల వారికి కూడా తమకు తోచిన సహాయం అందించడం ఎంతో గర్వంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు చందు సుబ్బారావు, మాజీ అధ్యక్షులు గోరకల రామదాసు, మాజీ గౌరవ అధ్యక్షులు తాండ్రంగి రామారావు, మిద్దె అప్పారావు, ఉపాధ్యక్షులు బండారు శ్రీనివాసరావు, కోశాధికారి రమేష్ కుప్పిశెట్టి వెంకట్, వల్లూరి జగదీష్, బల్ల రమణ, అప్పారావు పాల్గొన్నారు.

## మన్మోహన్ సింగ్ గొప్ప ఆర్థికవేత్త

విశాలాంధ్ర - మల్కాపురం: డాక్టర్ మన్మోహన్ సింగ్ గొప్ప ఆర్థిక వేత్త అని, పరిపాలనా దక్షుడు అని సెయింట్ ఆన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో శుక్రవారం డాక్టర్ మన్మోహన్ సింగ్ ఆర్థిక సంస్కరణలపై నిర్వహించిన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా ప్రసంగిస్తూ డాక్టర్ మన్మోహన్ సింగ్ కేంద్ర ప్రభుత్వానికి ఆర్థిక సలహాదారుగా, రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా, ఆర్థిక మంత్రిగా, దేశ ప్రధానిగా వివిధ పదవుల్లో సమర్థవంతంగా పనిచేసి దేశాభివృద్ధికి కృషి చేశారని అన్నారు. ఆయన నిజాయితీకి మారుపేరని శ్లాఘించారు. సమావేశంలో డాక్టర్ మన్మోహన్ సింగ్ జీవిత చరిత్రపై, ఆయన దేశానికి చేసిన సేవలపై అర్థశాస్త్ర అధ్యాపకులు బి.పి.రాజు కీలకోపన్యాసం చేశారు. సమావేశంలో జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయా దేవి, అధ్యాపకులు డి.జయశ్రీ, సుధారాణి పాల్గొన్నారు.

## వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం మిస్సింగ్ కేసు నమోదయింది. వివరాల్లోకెళ్తే చందక పంచాయతీ ఎడ్లవారి కల్లాలుకు చెందిన తాడ్డి కుమారి భర్త వెంకట్రావు (40) మద్యానికి బానిసై రెండు మూడు నెలల నుంచి మతిస్థిమితం కోల్పోయాడని, గత నాలుగు రోజుల క్రితం ఇంట్లోంచి వెళ్లగా ఎప్పటికీ రాకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చింత వాసు నాయుడు ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ గాంధీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఎల్ఆర్ఎస్ గడువు పొడిగింపు: వీఎంఆర్డీఏ ఎంసీ

విశాలాంధ్ర - విశాఖ : అనధికార లేఅవుట్ల, స్థలాల క్రమబద్ధీకరణ (ఎల్ ఆర్ ఎస్) - 2020 కింద పెండింగ్ లో ఉన్న అప్లికేషన్ల క్లియరెన్స్ గడువును మార్చి 31 వ తేదీ వరకూ ప్రభుత్వం పొడిగించిందని వీఎంఆర్డీఏ మెట్రోపాలిటన్ కమీషనర్ కె.ఎస్.విశ్వనాథన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన మెమోకు అనుగుణంగా చెల్లింపులు, దస్త్రాల సమర్పణకు ఇచ్చిన షార్ట్ ఫాల్స్, వివిధ దశలలో పెండింగ్ లో ఉన్న ఫైల్స్ ని గుర్తించి తదుపరి చర్యలను తీసుకుని నిర్దిష్ట పరిమితిలోగా క్లియర్ చేసే విధంగా చర్యలు తీసుకో వలసిందిగా అధికారులను ఆదేశించామని తెలిపారు. అదే విధంగా ఎల్ ఆర్ ఎస్ ద్వారా గతంలో 5803 దరఖా స్తులు రాగా అందులో 2942 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేసామని, 615 దరఖాస్తులు తిరస్కరిం చామని, 127 దరఖాస్తుదారులకు చెల్లింపు నోటీసులు జారీ చేసామని, 2111 దరఖాస్తుదారులకు షార్ట్ ఫాల్స్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. షార్ట్ ఫాల్స్ అందుకున్న దరఖాస్తుదారులు సంబంధిత దస్త్రాలను వీఎంఆర్డీఏకి సాధ్యమైనంత త్వరగా సమర్పించి దరఖా స్తులను క్లియర్ చేయడంలో సహకరించాలని కోరారు.

## వైభవంగా పగల్ పత్తు ఉత్సవాలు

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి పగల్ పత్తు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి తిరువీధి జరిగింది. వార్షికోత్సవాల్లో భాగంగా స్వామికి పగల్పత్ సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవ, ప్రభాత ఆరాధనలు పూర్తిచేసి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో సర్వాభరణాలతో శోభాయమానంగా అలంకరించి బంగారు తొళ్ళక్కియాన్లో అధిష్ఠింపజేశారు. స్థానాచార్యులు టిపి రాజగోపాల్ సారథ్యంలో అధ్యాపకులు నాలాయిర దివ్య ప్రబంధ పారాయణ చేశారు.

## సింగినబంధ గ్రామంలో రెవెన్యూ సదస్సు బహిష్కరణ

విశాలాంధ్ర - తగరపువలస: విశాఖపట్నం జిల్లా భీమునిపట్నం మండలం సింగనబంధ గ్రామంలో శుక్రవారం నిర్వహించవలిసిన రెవెన్యూ సదస్సుని స్థానిక రైతులు,ప్రజాప్రతినిధులు భీమునిపట్నం జడ్పీటీసీ సభ్యులు గాడు వెంకటప్పుడు, సర్పంచ్ గాడు వెంకటనారాయణ సదరు రెవిన్యూ సదస్సును బహిష్కరించి వెళ్లిపోయారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రెవిన్యూ సదస్సులను భీమునిపట్నం రెవిన్యూ అధికారులు బాధ్యాతరహిత్యంగా వ్యవహరిస్తూ ఉదయం 9 గంటలుకు జరగాల్సిన రెవిన్యూ సదస్సు 11.30 గంటలుకు కూడా నిర్వహించలేదు. ఏ ఒక్క రెవిన్యూ అధికారి కూడా మీటింగుకు రాకపోవడంతో రైతులు నిరసనలు తెలుపుతూ మీటింగ్ నుండి వెళ్లపోయారు. సింగనబంధ గ్రామ రెవిన్యూ పరిధిలో గతంలో నిర్వహించిన రీ సర్వేలో తీవ్ర అన్యాయం జరిగిందని రైతులు వాపోతున్నారు. ఒకరి భూమి మరొకరి పేరు మీద రావడంతో రెవిన్యూ అధికారులపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఒక ఎల్ పీమ్ నెంబరు ఐదుగురు పదిమంది రైతులకు జాయింట్ గా ఇవ్వడంతో రైతులు గందరగోల పరిస్థితుల్లో ఉన్నారు ఎన్నిసార్లు రెవిన్యూ అధికారులకు మొర పెట్టుకున్న రైతుల సమస్యలు ను పరిష్కరించక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండు నెలల కిందట గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో రైతులు పెట్టుకున్న ఒక్క దరఖాస్తును కూడా రెవిన్యూ అధికారులు పరిష్కరించక పోవడంతో రెవెన్యూ అధికారులు పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. రైతులు సమస్యలు ను పరిష్కరించకపోతే అలాంటప్పుడు మళ్లీ రెవెన్యూ సదస్సులును పెట్టి మాకు ఏమి న్యాయం చేస్తారని రైతులు వాపోతున్నారు. రైతులు గతంలో పెట్టుకున్న ధరఖాస్తులును వారి యొక్క భూ సమస్యలు పరిష్కరం చేసి అప్పుడు రెవిన్యూ సదస్సులను నిర్వహించాలని భీమిలి జడ్పీటీసీ సభ్యులు గాడు వెంకటప్పుడు, సర్పంచ్ గాడు వెంకటనారాయణ నిరసన వ్యక్తం చేసి మీటింగ్ నుండి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లా పశుగణాభివృద్ధి సంగం చైర్మన, భీమిలి జడ్పీటీసీ సభ్యులు గాడు వెంకటప్పడు, సర్పంచ్ గాడు వెంకటనారాయణ, గాడు తాతినాయుడు, గాడు వెంకటరావు, కేబుల్ వెంకట్రావు, సింగమబంధ గ్రామ రైతులు పాల్గొన్నారు.

## సాంసంగ్ నుంచి 'బిగ్ టీవీ డేస్' ప్రారంభం

విశాలాంధ- విశాఖపట్నం: ప్రముఖ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్‌సంగ్, నూతన సంవత్సరం మరియు గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని తమ 'బిగ్ టీవీ డేస్' ఆఫర్ ను తీసుకువచ్చింది. ఎన్ఈడి క్యూఎల్ఈడి 8 కే, నియో క్యూ ఎల్ఈడి 4 కే, ఓఎల్ఈడి, 4 కే యుహెచ్డి టీవీ మోడల్‌లతో సహా దాని ప్రీమియం బిగ్-స్క్రీన్ టీవీలపై ఆకర్షణీయమైన డీల్‌లను అందిస్తోంది. ఈ ఆఫర్ జనవరి 3 నుండి జనవరి 31, 2025 వరకు అందుబాటులో ఉంటుంది. సాంసంగ్ అందిస్తున్న ఈ బిగ్ టీవీ డేస్ లో ప్రీమియం ఫీచర్లతో ఉన్న విభిన్న తరహా టెలివిజన్లను రాయితీ ధరలు అందిస్తున్నట్టు ఆ సంస్థ ప్రతినిధి చెప్పారు.

## విశాఖలో రియల్ ఎస్టేట్ కుదేలైంది

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విశాఖపట్నంలో రియల్ ఎస్టేట్ కుదేలైపోయిందని కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ బాధ్యులు ప్రియాంక దండి అన్నారు. గత ఎన్నికల్లో నగరంలో కూటమి సభ్యులు క్లీన్ స్వీప్ చేసారని అధికారంలోకి వచ్చి 6 నెలలు దాటిన రియల్ ఎస్టేట్ అభివృద్ధికి సరైన ప్రణాళిక చేయకపోవడం దురదృష్టకరం అని ఆమె అన్నారు. ఎమ్మెల్యేలు బాధ్యత వహించాలన్నారు. బిల్డర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు విశాఖ వదిలి హైదరాబాద్ వెళ్లిపోతున్నారని, నిర్మాణ రంగంలో ఉన్న వారు అప్పులు పాలవుతున్నారని, కార్మికులు పనులు లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. రియల్ ఎస్టేట్ మరియు నిర్మాణ రంగం బాగుంటేనే ఇతర రంగాలు బాగుంటాయని ప్రియాంక అన్నారు. అమరావతి అభివృద్ధి చేస్తూ కూటమి ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక రాజధాని విశాఖను మరిచారని ప్రియాంక ఒక ప్రకటనలో విమర్శించారు.

## సావిత్రి బాయి పూలేకు ఘన నివాళులు

విశాలాంధ్ర - సాగర్ నగర్: సావిత్రిభాయి పూలే 190వ జయంతి వేడుకలు ట్రైబల్ కల్చరల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ మిషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మిషను డైరెక్టర్ భార్గవి ఆదేశాలతో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాణి మంద ఆధ్వర్యంలో సావిత్రిభాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళు లర్పించారు. సావిత్రిభాయి పూలె కారణజన్ములు అని, స్త్రీల విద్య, సాధికారతకు చేసిన కృషి ఆదర్శవంతమైనదన్నారు.

భీమిలి: ఎంఈఓ కార్యాలయంలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సావిత్రి బాయి పూలేకు ఘన నివాళులర్పించారు. భీమిలి మండల విద్య శాఖ అధికారిణి లు ఎంఈఓ - 1 ఎం.శివ రాణి, ఎంఈఓ -2 ఏ జయప్రద ఏపీ ఎంటి ఎఫ్ భీమిలి యూనిట్ పక్షాన మహిళా ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేయడం

జరిగింది. ఈ కార్యక్రమంనకు ఏపీ ఎంటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సి.హెచ్.అమర్నాథ్ నేతృత్వం వహించగా భీమిలి ఏపీ ఎంటీఎఫ్ అధ్యక్షులు జి.దుర్గ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి వై.ప్రతాప్ సింగ్ మహిళా అధ్యక్షురాలు కె. లీలమణి, వైస్ ప్రెసిడెంట్ వై.వెంకటేష్, అసోసియేట్ ప్రెసిడెంట్ సి.హెచ్. అశోక్ పాల్గొనడం జరిగింది.

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధిలో పలు వార్డులో సావిత్రిబాయి పూలే 194వ జయంతి వేడుకలు పారిశ్రామిక ప్రాంత సంఘ సేవకులు బిజెపి నాయకులు ఇండస్ట్రియల్ ఏరియా శ్రామిక శక్తి లేబర్ యూనియన్ వ్యవస్థాపకులు పెద్దిరెడ్ల నానాజీ ఆధ్వర్యంలో శుక్రవారం 62 వ వార్డు గుడివాడ అప్పన్న కాలనీ 58 వ వార్డు ప్రాథమిక ఉన్నత పాఠశాలలో భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు

సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ సిహెచ్ రామ్మోహన్ నాయుడు తోపాటు ఉపాధ్యాయురాలు విద్యార్థిని విద్యార్థులు అందరూ కలిసిముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించిన అనంతరం సిహెచ్ రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ భారత దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే ఆశయ సాధనలో నేటి విద్యార్థులు అందరూ మెలగాలని నేటి విద్యార్థులే రేపటి మేధావులని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో 58వ వార్డు టిడిపి ప్రధాన కార్యదర్శి పోతాబత్తుల శ్రీనివాస్ 58వ వార్డు బిజెపి అధ్యక్షులు తెప్పల సతీష్ పాడిరాజు పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయురాలు రమణకుమారి, పద్మజ,పి విజయ్ కుమార్, ఎంఎస్ ప్రకాష్, సిహెచ్ రామలక్ష్మి, దేవిక, నాగశ్రీ, నూకలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న గీతాలాపన

విశాలాంధ్ర - సాగర్ నగర్: ఎనిమిదవ వార్డు పరిధిలో బీచ్ రోడ్‌లో సాగర్ నగర్‌లో గల శ్రీ మోగదారమ్మ మహాలక్ష్మి ఆలయంలో శుక్రవారం రాగా మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో కె.నాగజ్యోతి సారధ్యంలో నిర్వహించిన

గీతాలాపన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మహాలక్ష్మి అమ్మవారి జీవిత చరిత్రపై పాడిన పాటలు భక్తులను ఎంతగానో మంత్రముగ్ధులను చేశాయి.

## జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు 4వ తేదీ నుంచి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు జరుగుతుందని జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషనల్ అధికారిణి బి. పద్మ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్ ఛార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, రాష్ట్ర తెదేపా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఇతర ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో పెదగంట్యాడ మండలం అగనంపూడి జూనియర్ కళాశాలలో జిల్లా స్థాయి కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ కూడా మధ్యాహ్న భోజన పథకం ప్రారంభోత్స కార్యక్రమంలో జిల్లాలోని ఏదొక జూనియర్ కళాశాల నుంచి భాగస్వామ్యం కానున్నారని తెలిపారు. జిల్లాలో 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో ఈ కార్యక్రమం అమలు జరగనుందని పేర్కొన్నారు.

## పాఠశాలను సందర్శించిన ఎంఈఓ-1

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం భీమన్న దొరపాలెంలో మండల విద్యాశాఖ అధికారి -1 కె.గంగరాజు ఎంపీయూపీ పాఠశాలను శుక్రవారం సందర్శించారు. పత్రికల్లో ప్రచురించిన కథనాలకు శుక్రవారం పాఠశాలను సందర్శించి పూర్తిస్థాయిలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ,విద్యార్థులు తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులతో మాట్లాడి దర్యాప్తు జరిపారు. వారి దగ్గర తీసుకున్న స్టేట్మెంట్ ఆధారంగా నివేదికను తయారుచేసి జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమ్ కుమార్‌కు తెలియపరుస్తామని ఎంఈఓ తెలిపారు.

## అనారోగ్యంతో ఉన్న వ్యక్తికి సహాయం

విశాలాంధ్ర - గాజువాక: గాజువాక నియోజకవర్గం జీవీఎంసీ 71వ వార్డు పరిధి శ్రీరామ్ నగర్ నివాసి పి.సింహాచలం (76) గత పది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వప్పు రాజారావు సహకారంతో సింహాచలం కుటుంబ సభ్యులు ఎమర్జెన్సీ ట్రీట్మెంట్ కోసం ఆర్‌కే హాస్పిటల్లో

జాయిన్ చేయడం జరిగింది. మనిషి ప్రాణాలతో వున్న ప్రజాజీవితంలో లేని వ్యక్తిగా డాక్టర్లు మధ్య వైద్యం జరుగుతుంది. జనవరి 1 నూతన సంవత్సరం సెలవు సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఒక్కరోజు ముందుగా పెన్షన్లు ఇవ్వడం జరిగింది. దీనిలో భాగంగా పి.సింహాచలం ఆర్ కే హాస్పిటల్లో ట్రీట్మెంట్ తీసుకుంటున్న వ్యక్తి దగ్గరకి శ్రీరామ్ నగర్ సచివాలయం అడ్మిన్ వరలక్ష్మి, అడ్మిన్ సచివాలయం సెక్రటరీ గణేష్ సింహాచలం భార్య ధనలక్ష్మికి పెన్షన్ అందజేశారు.

## స్పోర్ట్స్ మీట్ రీ షెడ్యూల్ ఖరారు

విశాలాంధ్ర - సింహాచలం: గ్రేటర్ విశాఖ 98వ వార్డ్ పరిధిలో ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే వెనుకబడిన తరగతుల సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాలలో ఈ నెల 5, 6 తేదీల్లో స్పోర్ట్స్ మీట్ జరుగనున్నట్లు ప్రిన్సిపాల్ రమా మోహిని తెలిపారు. గతంలో జరగాల్సిన 2024 స్పోర్ట్స్ మిట్ వాతావరణం, భారీ వర్షాలు, కొన్ని మండలాల్లో కార్యక్రమాన్ని వాయిదా వేయవలసి వచ్చిందని ప్రిన్సిపాల్ తెలిపారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో స్పోర్ట్స్ మీట్ 2025 జనవరి 5, 6వ తేదీల్లో జరగడానికి రీషెడ్యూల్ చేయబడింది. విద్యార్థులు తమ క్రీడా ప్రతిభను సురక్షితంగా ప్రదర్శించే అవకాశం ఉందని ఆమె తెలిపారు.

## పీఎం కిసాన్ పెంపుపై హర్షం

విశాలాంధ్ర - ఆనందపురం: పీఎం.కిసాన్10 వేలకు పెంచిన బీజేపీ ప్రభుత్వంపై బిజెపి విశాఖ జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షులు పి.వి.వి.ప్రసాదరావు పట్నాయక్ హర్షం వ్యక్తం చేశారు. ఆనందపురం మండలంలో వెల్లంకి బిజెపి పార్టీ కార్యాలయంలో విశాఖ జిల్లా కిసాన్ మోర్చ నాయకులు,ఆనందపురం మండల బిజెపి నాయకులు పాల్గొని మాట్లాడారు. పీఎం కిసాన్ సన్మాన్ నిధి పథకం కింద రైతులకు ఇవ్వబడుతున్న 6 వేల రూపాయల నిధిని 10వేల రూపాయలకు పెంచిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వం నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వం

రైతులకు మేలు చేసే ప్రభుత్వం తెలిపారు. రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఉప్పాడ అప్పారావు మాట్లాడుతూ రైతుల కోసం భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలలో పీఎం కిసాన్ సన్మాన్ నిధి పథకం భారతదేశంలో ప్రతి రైతు కుటుంబానికి ఉపయోగపడే పథకమని, ప్రతి సంవత్సరం ఇప్పటి వరకు సంవత్సరానికి మూడుసార్లు 6000 రైతుల అకౌంట్లో జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా కిసాన్ మోర్చ ప్రధాన కార్యదర్శి పాట్నూరు వెంకట కృష్ణారావు, ఆనందపురం మండల బిజెపి పార్టీ అధ్యక్షులు పిల్లా విజయ, మాజీ మండల అధ్యక్షులు మీసాల రాము నాయుడు విశాఖ జిల్లా కిసాన్ మోర్చ నాయకులు పేర్రాజు, అనిల్ రాజు, బిజెపి మండల నాయకులు బోర శ్రీను, పోతిన జీవన్ సంతోష్, మాద బత్తుల బుజ్జి, డి.పి.జె.ఎస్.వి.రత్నం, పిల్లా సూర్య నారాయణ, సుధాకర్ వర్మ, చైతన్య వర్మ, నిమ్మకాయల అప్పలరాజు, ఉప్పాడ శివ పాల్గొన్నారు.

## వెంకటాద్రి క్షేత్రంలో శ్రీనివాసునికి క్షీరాభిషేకం

విశాలాంధ్ర - పెందుర్తి : వెంకటాద్రి క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాలు19 వ రోజు వైభవంగా జరిగాయి. ప్రధాన అర్చకులు

మహర్షి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు తెల్లవారుజామునే స్వామివారిని మేల్కొల్పి, తనయ విన్నపం చేసి హారతి చేశారు, అనంతరం సేవకాలం, శాత్తుమొరై, తిరుప్పావై పారాయణం, ప్రవచనం తదితర కార్యక్రమాలు పూర్తిచేసి స్వామి వారికి ప్రసాదాలు నివేదన చేసారు. భక్తులకు తీర్థ గోష్ఠి, ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈవో నీలిమ ఆధ్వర్యంలో దేవస్థానం సిబ్బంది భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. కొండ దిగువ నుండి ఆలయం వరకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారు. అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, జీవీఎంసీ టిడిపి ఫ్లోర్ లీడర్ స్థానిక కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు తదితర ప్రముఖులు శుక్రవారం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు.

## నీటి శుద్ధి కేంద్రాన్ని సందర్శించిన విద్యార్థులు

విశాలాంధ్ర - పద్మనాభం: ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పారిశ్రామిక పర్యటనలో భాగంగా శుక్రవారం మారిక వలసలోని నీటి శుద్ధి కేంద్రాన్ని సందర్శించారు. ఈ కేంద్రం

నిర్వాహకులు జిఎన్ గాయత్రీ దేవి ఆధ్వర్యంలో విద్యార్థులకు నీటి శుద్ధి కేంద్రాన్ని గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె ఆర్ కె పట్నాయక్, ఉపాధ్యాయులు భాస్కర్ రావు, శ్రీనివాసరావు, ఒకేషనల్ ఉపాధ్యాయులు భీష్మ నారాయణ, ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# 8న ప్రధాని మోడీ విశాఖ పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

### విశాఖ జిల్లా అధికారులకు సిఎస్ ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఈనెల 8వ తేదీన ప్రధాన మంత్రి నరేంద్ర మోడి విశాఖపట్నం పర్యటన విజయవంతానికి విస్తృతమైన ఏర్పాట్లు చేయడం జరుగుతుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పేర్కొన్నారు. ప్రధాని పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుండి ఆయన వీడియో సమావేశం ద్వారా విశాఖ జిల్లా సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా సిఎస్ మాట్లాడుతూ ప్రధాని పర్యట నను విజయవంతం చేసేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఏర్పాట్లకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై ఇప్పటికే సాధారణ పరిపాలన శాఖ ద్వారా ఉత్తర్వులు జారీ చేశామని అందుకనుగుణంగా ఆయా శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రధాని పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లలో ఏచిన్న పొరపాటుకు ఆస్కారం లేని రీతిలో కట్టుదుట్టమైన పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని విశాఖపట్నం జిల్లా కలక్టర్, పోలీస్ కమీషనర్ సహా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రధాని పర్యటనకు సంబంధించి ఇంకా మినిట్ టు మినిట్ కార్యక్రమం ఖరారై రావాల్సి ఉందని ఈలోగా వివిధ శాఖల పరంగా చేయాల్సిన ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని స్పష్టం చేశారు. ఈనెల 8వ తేదీ సాయంత్రం ప్రధాన మంత్రి విశాఖపట్నం చేరుకుని సంపత్ వినాయక గుడి నుండి ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసే సభా వేదిక వరకూ రోడ్డు షో నిర్వహించనున్నారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ పేర్కొన్నారు. పార్కింగ్ స్థలాల్లో తగిన విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని విద్యుత్, మున్సిపల్ శాఖల అధికారులను సిఎస్ ఆదేశించారు. అగే విధంగా సభా వేదిక,పార్కింగ్ ప్రాంతాల్లో తాగునీరు,తాత్కాలిక మరుగుదొడ్లు,ఇతర సౌకర్యాలను కల్పించాలని అన్నారు. జీఏడి ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్ ప్రధానమంత్రి పర్యటనకు సంబంధించి విశాఖపట్నం జిల్లా కలక్టర్,పోలీస్ కమీషనర్ సహా వివిధ శాఖల అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో డిజిపి ద్వారకా తిరుమల రావు,సియం కార్యదర్శి ప్రద్యుమ్న, టిఆర్అండ్బి ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే,అనకాపల్లి,విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల కలక్టర్లు విజయకృష్ణన్,డా.బిఆర్ అంబేద్కర్,స్వప్నిల్ దినకర్,ఎస్పిలు,ఇతర అధికాకరులు పాల్గొన్నారు.పిహెచ్ది రామకృష్ణ,హరి నారాయణ తదితరులు పాల్గొన్నారు. విశాఖపట్నంలో రైల్వే జోన్ ఏర్పాటుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడి శంకుస్థాపన చేయనున్నారు.అదే విధంగా అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం పూడిమడకలో ఎన్.టి.పి.సి.ఇంటిగ్రేటెడ్ గ్రీన్ హైడ్రోజన్ హబ్ కు వర్చువల్ గా శంకుస్థాపన చేస్తారు.ఈ ప్రాజక్టు కింద ఆకంపెనీ రూ.65,370 కోట్ల పెట్టుబడులను మూడు దశల్లో పెట్టనుంది.కృష్ణపట్నం ఇండస్ట్రీయల్ హబ్ ను కూడా ప్రధాన మంత్రి వర్చువల్‌గా ప్రారంభించనున్నారు.రూ.1518 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టును తొలి దశలో 2,500 ఎకరాల్లో ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 50 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కలుగనున్నాయి.అదే విధంగా నక్కపల్లిలో 2001.8 ఎకరాల విస్తీర్ణంలో రూ.1876.66 కోట్లతో ఏర్పాటు చేసే బల్కు డ్రగ్ పార్కును వర్చువల్ గా శంఖుస్థాపన చేయనున్నారు.ఈ పార్కులో రూ.11,542 కోట్ల మేర పెట్టుబడులు రావడం ద్వారా 54 వేల మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి.

# విజయవాడలో ఐదు లక్షల మందితో హైందవ శంఖారావం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ప్రభుత్వ ఆధీనం నుంచి దేవాలయాలను, హిందూ ధార్మిక సంస్థలను విముక్తి చేయాలనే విశ్వహిందూ పరిషత్ పిలుపు తో జనవరి 5న విజయవాడలో జరుగనున్న హైందవ శంఖారావం సభకు విశాఖ నుంచి వేల సంఖ్యలో జనం హాజరుకానున్నారని హైందవ శంఖారావం కన్వీనర్ అన్నే బాబ్జీ తెలిపారు. హెూటల్ స్మార్ట్ ఇన్‌లో జరిగిన విలేఖలు సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ నుంచి ఈ " హైందవ శంఖారావం" భారీ బహిరంగ సభకు 82 బస్సులు, వందల కార్లు, 3 స్పెషల్ ట్రైన్స్ సాదారణ ట్రైన్స్ ద్వారా వేల మంది వెళుతున్నారన్నారు. ఇందుకోసం విశాఖ నగరం నలుమూలల గత నెల రోజులుగా పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు, సభలో ర్యాలీలు జరిగాయన్నారు. ప్రజా ప్రతినిధులతో పాటు అన్ని పార్టీల రాజకీయ నాయకులను ఈ సభకు ఇప్పటికే ఆహ్వానించామన్నారు. విశ్వహిందూ పరిషత్ దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఈ కార్యక్రమం విజయవాడకు సమీపంలోని గన్నవరం కేసనపల్లి వద్ద ఐదు లక్షల మందికి పైగా జనంతో జరుగుతుందన్నారు. దేవాలయాలను హిందూ సమాజానికి అప్పగించే ముందు దేవాలయాలు, దేవాదాయ శాఖలలో పనిచేసే హిందువేతరులందరినీ తొలగించాలన్నారు. ట్రస్ట్ బోర్డులు మరియు దేవాలయాల నిర్వహణలో ఏ రాజకీయ పార్టీతో సంబంధం ఉన్న వారిని, రాజకీయ నాయకులను లేదా వ్యక్తిని నియమించకూడదన్నారు. విశ్వ హిందూ పరిషత్ నగర అధ్యక్షులు ఆచార్య కె. విశ్వనాథ్ పాల్గొన్నారు.

# వర్గీకరణ జోలికి వస్తే కష్టం బాబు..!

**- కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతామోహన్**

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఎస్సీల వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం తొందరపాటు చర్య అని, వర్గీకరణ జోలికి వస్తే చాలా కష్టం చంద్రబాబు" అని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతా మోహన్ హెచ్చరించారు. శుక్రవారం వి జె ఎఫ్ ప్రెస్ క్లబ్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీల వర్గీకరణ తాను తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. వర్గీకరణ విషయంలో ఎస్సీలు రగిలిపోతున్నారని, పల్లెలు, పట్టణాలనుంచి ప్రజలు రోడ్ల మీదకు వచ్చి ఉద్యమిస్తారని హెచ్చరించారు. తలతిక్క జడ్జిమెంట్ ను పట్టుకొని వేలాడొద్దని, మాల, మాదిగలను విడదీయడం సరికాదన్నారు. పక్కనే ఉన్న ఏపీ కంటే పెద్ద రాష్ట్రమైన తమిళనాడులో ముఖ్యమంత్రి స్టాలిన్, కేరళలో లెఫ్ట్ పార్టీల ప్రభుత్వం, ముఖ్యమంత్రి విజయన్ లకు లేని ఆలోచన ఏపీలో ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. తమిళనాడు, కేరళ, ఉత్తర ప్రదేశ్ వంటి రాష్ట్రాల ముఖ్యమంత్రులు సుప్రీమ్ కోర్టు జడ్జిమెంట్ కాపీలను బుట్టలో పడేశారన్నారు. ఏపీలో వర్గీకరణ పై ఏకసభ్య కమిషన్ వేయడం తప్పు. ఆ మిశ్రా కి అంటరానితనం అంటే ఏమిటో తెలీదన్నారు. 5 వేల సంవత్సరాలుగా ఎస్సీలు పడుతున్న కష్టాలు, నష్టాలు గురించి మిశ్రాకు తెలుసా? అని సూటిగా ప్రశ్నిస్తున్నానన్నారు. ముక్కు మొహం తెలియని, మిశ్రను తీసుకొచ్చి ఏపీలో జిల్లాలు తిరగమనడం పొరపాటు చర్యన్నారు.చంద్రబాబు నాయుడు ఎస్సీ వర్గీకరణ పై స్పందించాలని డిమాండ్ చేశారు. వైజాగ్‌కు మోడీ రాబోతున్నారని, ప్రధానితో మాట్లాడి విశాఖ ఉక్కును కాపాడాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సూర్యా రావు, అభిదా బేగం పాల్గొన్నారు.

# భారత సైన్యంలో మహిళలకు అనేక అవకాశాలు

విశాలాంధ్ర - మల్కాపురం: భారత సైన్యంలో మహిళలకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సెయింట్ ఆన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో సైనిక అధికారులతో విద్యార్థినులకు నిర్వహించిన లిముఖా- ముఖిలి కార్యక్రమాన్ని ఆమె ప్రారంభిస్తూ యుద్ధ సమయంలో వీరోచిత సేవలు అందించిన ప్రముఖులు విద్యార్థినులతో తమ అనుభవాలు పంచుకోవడం ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమంలో భాగంగా విశ్రాంత సైనిక అధికారులు లెఫ్టినెంట్ జనరల్ అట్లూరి ఉత్తమ్, జి.ఎం. నాయర్, ఎస్. రవి శంకర్, కల్నల్ వి.సి. భట్, గ్రూప్ కెప్టెన్ కెట్కర్, బ్రిగేడియర్ కె.పి సింగ్ తదితరులు- యుద్ధ సమయంలో సైన్యం చూపించే ధైర్య సాహసాలను , ఐక్యతను, దేశభక్తిని ఉదాహరణలతో వివరించి విద్యార్థినులను ఉత్తేజపరిచారు. భారత సైన్యంలో మహిళలకు గల అవకాశాలను గురించి తెలియజేశారు. సైన్యంలో పనిచేయడానికి కావలసిన నైపుణ్యాలను, శక్తిసామర్థ్యాలను ఎలా పెంచుకోవాలో తెలియ చేశారు. కార్యక్రమంలో వారి జీవిత భాగస్వాములు కూడా పాల్గొని వారి అనుభవాలను, కుటుంబ త్యాగాలను తెలియజేశారు. అనంతరం క్రీడల్లో, ఆత్మరక్షణ విద్యలలో విశేష ప్రతిభ కనబరిచిన సెయింట్ ఆన్స్ విద్యార్థినులను సర్టిఫికెట్లతో అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఎన్. సి.సి. కాడెట్స్, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు భోజనం ప్లేట్లు పంపిణీ

విశాలాంధ్ర - పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు నడుపూరులో ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు భోజనం ప్లేట్లు, గ్లాసులు పంపిణీ కార్యక్రమాన్ని అమ్మవాసవి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ గంధం శ్రీనివాసరావు పాల్గొని విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినంద నీయమని అన్నారు. పాఠశాల నిమిత్తం ఏ అవసరం ఉన్నా తన దృష్టికి తీసుకు వస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పాఠశాల ఆవరణలో సరస్వతి దేవి విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తామని ట్రస్ట్ సభ్యులు హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు డాక్టర్ కె.కీర్తి ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమంలో అమ్మవాసవి సేవా ట్రస్ట్ సభ్యులు రామానుజ స్వామి, బెల్లాల పెంట బాబు, కులుకూరి మంగరాజు, బొడ్డు కృష్ణారావు, వెంకట రావు, నాగేశ్వర రావు, చంటి, బొడ్డు కృష్ణ ప్రసాద్, శశి కళ, సరోజిని, శివ ప్రసాద్, సోమరాజు ట్రస్ట్ సభ్యులు ఎం.ఈ.ఓ శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ రమణమ్మ, తది తరులు పాల్గొన్నారు.

## వ్యక్తి ఛాతిలో దీర్ఘకాలంగా ఉన్న వస్తువు తొలగింపు




విశాలాంధ్ర- విశాఖపట్నం: ఒక వ్యక్తి ఛాతి భాగంలో దీర్ఘకాలంగా ఉండిపోయిన ఒక వస్తువును చికిత్స ద్వారా తొలగించినట్టు అపోలో వైద్యులు తెలిపారు. 24 సంవత్సరాల యువకుడు, గత 10 సంవత్సరాలుగా తరచుగా దగ్గు, జ్వరం, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది, ఎడమ వైపు ఛాతీ నొప్పి తో బాధపడుతూ వివిధ ఆసుపత్రుల్లో చేరి చికిత్స తీసుకున్న ఫలితం లేకపోవడంతో తమ ఆసుపత్రి కి వచ్చారన్నారు. అపోలో ఆసుపత్రిలో ఛాతీ విభాగ వైద్య నిపుణులు డాక్టర్ ఆవాల రవిచరణ్ వైద్య పరీక్షలు జరిపి, వ్యాధిగ్రస్తుడు తన పాఠశాల సమయంలో ఒక వస్తువు (పెన్/పెన్సిల్ టిప్)ను లోపలికి తీసుకున్నట్లు నిర్ధారించడం జరిగిందన్నారు. ఛాతీ సిటీ పరీక్ష నిర్వహించగా ఎడమ క్రింది లోబ్ సెగ్మెంటల్ బ్రాంకస్‌లో ఒక పైపురూప నిర్మాణం కనిపించిందని, బ్రోన్కోస్కోపీ చేసి గ్రాన్యులేషన్ టిష్యూ తొలగించి, ఆ ఫారిన్ బాడీనీ జాగ్రత్తగా బయటికి తీసివేయడం జరిగిందని చెప్పారు. ప్రస్తుతం ఆ యువకుడు కోలుకుంటున్నట్టు వైద్యులు తెలిపారు.